# కాపీ చెక్ స్టోరీ

"ఎన్నిసార్లు చెప్పను? అయినా నేను అన్న దాన్లో అసహజం ఏమీ లేదే? ఎందుకలా విరుచుకుపడతావ్?" ఆవేశంగా అరిచాడు శేఖర్.

"ఎంత మారిపోయారండీ మీరు. కట్నం లేకుండా పెళ్ళిచేసుకుంటే మీరు ఆదర్శపురుషుడని, నేను అదృష్టవంతురాలినని ఎంతో మురిసిపోయాను. పెళ్ళయి రెండేళ్ళు బాగానే వున్నారు. ఎన్నడూ లేంది మీ నాన్నని అడిగి డబ్బు పట్రా అంటారా? అప్పటికీ ఒకసారి ఆఫీస్ వాళ్ళంతా ఒక సొసైటీగా ఏర్పడి ప్లాట్స్ కొంటున్నారు - మనమూ తీసుకుందాం, మీ నాన్నని అడిగి 50 వేలు తీసుకురమ్మన్నారు. సిగ్గువిడిచి అడిగాను. పోన్లే వాళ్లకీ ఓ గూడు ఏర్పడుతుందని నాన్న మీరడిగింది ఇచ్చారు. ఇప్పుడు మళ్ళీ ఫ్రెండ్‌తో కల్సి సైడ్ బిజినెస్ చేస్తాను ఇంకో 50 వేలు తెమ్మంటున్నారు. మా నాన్నేమైనా జమిందారా? పైగా పెళ్ళి కావాల్సిన చెల్లెల్లుంది. దానికి తమరిలా 'ఆదర్శపురుషుడు' దొరకడుగా. కట్నం ఇచ్చే తీరాలి. ఇప్పుడు మళ్ళీ 50 వేలంటే మాటలా? చెప్పండి... మీ మనసులో ఏదో మసలం వుంది. అందుకే ఇలా మాట్లాడుతున్నారు" ఆవేశంతో వూగిపోతూ అంది సుధ.

"చూడు సుధా! పదే పదే నాతో చెప్పించి నన్ను రెచ్చగొట్టకు.వారంలోగా డబ్బు తెస్తావా సరే సరి. లేదా నీ దారి నువ్వు చూసుకో వచ్చు" అంటూ తాపీగా జగ్‌లో మంచినీళ్ళు గ్లాస్‌లో వంపుకుని తాగి వెళ్ళిపోయాడు.

నిశ్చేష్టురాలై నిలబడిపోయింది సుధ.

* * *

తెగతెంపులు చేసుకుని పోవాలంటే నిముషం చాలదు. బంగారం లాంటి కాపురం. బాదరబందీలేని సంసారం. భర్త వదిలేసిన భార్యగా లోకం దృష్టిలో నిందని భరిస్తూ బతకలేదు. అలాగని తండ్రిని అడగలేదు. ఏం చేయాలి? అన్నయ్యలున్నా ఎవరి సంసారాలు వాళ్ళవి. తండ్రి మరో పదిరోజుల్లో రిటైర్ అయిపోతున్నాడు. సొంత గూడు వున్నా అమ్మితే 20 వేలు రావు. ఈ ఒక్కసారికి అడగమంటున్నారుగా. చూద్దాం. అంతగా అయితే నెలనెలా పొదుపుచేసి తనే తండ్రికి పంపొచ్చు.

మనసులో ఏమనుకున్నా, కూతురు అడగగానే 50 వేలు ఇచ్చాడు తండ్రి. మిగిలిన డబ్బు కొడుకుల చదువులు, వాళ్ళ ఉద్యోగాలకోసం చేసిన అప్పులు, మిగిలిన చిల్లరమల్లర అప్పలకి బొటాబొటీగా సరిపోయింది. తండ్రి గ్రాట్యుటీకోసం ఎదురుచూస్తున్న కొడుకులు, డబ్బంతా సుధకి ఇచ్చినందుకు తండ్రిని నానా మాటలు అని, ట్రాన్స్‌ఫర్‌లు చేయించుకుని వెళ్ళిపోయారు.

రెక్కలు తెగిన పక్షిలా రెండో కూతురి పెళ్ళికి నానా తంటాలు పడ్డాడు. 60, 70 వేలకి తక్కువగా ఒక్క సంబంధం రావటం లేదు. చేతిలో పెన్షన్ డబ్బు తప్పితే గట్టిగా ఏం లేదు. కొడుకులిద్దర్నీ చేయిచాచి అడిగి ఛీకొట్టించుకున్నాడు. మౌనంగానే గుండెల్లో రోదిస్తున్నాడు.




* * *

"సుధా! సుధా!" శేఖర్ మంచంమీద కూర్చుంటూ పిలిచాడు.

"వస్తున్నానుండండి" విసుక్కుంటూ వచ్చింది సుధ. ఇదివరకులా భర్తమీద ప్రేమ చూపించలేకపోతుంది. అతన్నో నయవంచకుడుగా తలపోస్తోంది. చెల్లి పెళ్ళికి తనే అవరోధంగా నిల్చిందన్న మనోవేదన మరోవైపు.

"ఇదిగో ... ఇటు చూడు. ఇది తీసికెళ్ళి మీ నాన్నగారికివ్వు" అంటూ లక్ష రూపాయిలకు రాసి వున్న చెక్‌ని అందించాడు.

"ఏమిటండీ ఇది? ఎక్కడిదీ డబ్బు?" ఆశ్చర్యంగా అడిగింది సుధ.

"నేను రెండు నెలల క్రితం క్యాంప్‌కెళ్తూ దారిలో మీ నాన్నగారి ఇంటికి వెళ్ళాను గుర్తుందా"ఆమె చుట్టూ చేతులేస్తూ అన్నాడు.

"అవును."

"మీ నాన్నగారు రిటైర్ అయ్యాక వచ్చే డబ్బుతో ఏం చేయాలో ప్లాన్స్ చేస్తున్నారు అప్పడే మీ అన్నయ్యలు. మీ చెల్లి పెళ్ళికి డబ్బు సర్దుదామన్న ఆలోచన ఇద్దరికీ వున్నట్లు అన్పించలేదు. తండ్రిని బుట్టలోవేసి డబ్బు చెరిసగం పంచుకోవాలని చూస్తున్నారు. ఆ డబ్బు మీ నాన్నగారి దగ్గరుంటే ఇక మరదలి పెళ్లి ఇంతే సంగతులు అన్పించింది. అందుకే ఆయన దగ్గర్నుండి రాబట్టడానికి అలా నాటకం ఆడాను. మీ చెల్లి పేరు మీద్ద డిపాజిట్ చేశాను. ఇక తన పెళ్ళికి ఏవిధమైన ఆటంకం వుండదుగా" అంటున్న భర్తని ఆర్తిగా అల్లుకుపోయింది సుధ.

"మీరెంత మంచివారండి. మీ మనసులో ఆంతర్యం తెలియక మిమ్మల్ని దశమగ్రహంగా వూహించుకున్నాను. దైవంలా ఇలా ఆదుకుంటారనుకోలేదు" కళ్లనీళ్ళ పర్యంతం అయ్యింది సుధ.

"పిచ్చి సుధా. కడుపున పుట్టకపోయినా ఒకరి అవసరాలకి మరొకరు సాయపడటం మానవత్వం. అది కొడుకైనా, అల్లుడైనా సరే.

—ఆర్. పద్మజ